క్లుప్తంగా

సమ్మె జయప్రదం చేయాలి



స్కూటర్ ర్యాలీ నిర్వహిస్తున్న ఏఐటియూసీ, సిఐటియు నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఈ నెల 16న కేంద్ర కార్మిక, రైతు, వ్యవసాయ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన గ్రామీణ భారత్ సమ్మె జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. బుధవారం ఈ మేరకు నగరంలో స్కూటర్ ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు నాగసుబ్బారెడ్డి, మనోహర్, దస్తగిరి రెడ్డి, జి. వేణుగోపాల్, కెసి. బాదుల్లా, ఎస్. వెంకట శివ, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం

కడప కల్చరల్ : కడప నగరం నబీకోటకు చెందిన విద్యార్థి వీ రాజేష్‌రెడ్డికి ప్రముఖ విద్యా వేత్త సీనియర్ ఛార్టర్డ్ అకౌంటెంట్ లయన్ పీ ఖాసీం ఖాన్ ఆర్థిక సహాయం అందజేశారు. ఛార్టర్డ్ అకౌంట్స్ కోర్స్ చదువుతున్న రాజేష్ పేదరికంతో ఇబ్బందులు పడుతుండడం గమనించి మూడేళ్ల పాటు ఏటా రూ. 20 వేలు తమ తల్లి పేరిట ఏర్పాటు చేసిన చాంద్‌బీ మెమోరియల్ ట్రస్ట్ పక్షాన ఆ విద్యార్థికి అందజేసేందుకు నిర్ణయించారు. ఇందులో భాగంగా గురువారం తల్లి లక్ష్మీదేవితో వచ్చిన విద్యార్థికి తొలి విడతగా రూ. 10 వేలు అందజేశారు. కార్యక్రమంలో ఆడిటర్ పీ షరీఫ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

కేవీకేలో రైతులకు శిక్షణ

కడప అగ్రికల్చర్ : కడప నగర శివార్లలోని ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రంలో 15, 16 తేదీలలో ప్రకృతి వ్యవసాయం సాగుపై రైతులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కేవీకే కో ఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయంలో పాటించవలసిన యాజమాన్య పద్ధతులు, పోషక యాజమాన్యం, సస్యరక్షణ పద్ధతులపై శిక్షణ తరగతులను నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల రైతులు హాజరుకావాలని ఆయన కోరారు.

విగ్రహ ప్రతిష్ట



పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ, ఆర్‌జేడీ, డీఈఓలు

కడప ఎడ్యుకేషన్ : జిల్లా విద్యాశాఖ కార్యాలయ ఆవరణంలో రూ. 8 లక్షల దాతల సహకారంతో నిర్మించిన గుడిలో బుధవారం సరస్వతి, విఘ్నేశ్వరుడి విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి, పాఠశాల విద్య ఆర్‌జేడీ రాఘవరెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి అనురాధ, డిప్యూటీ ఈఓ రాజగోపాల్‌రెడ్డిలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ కార్యాలయ సిబ్బందితోపాటు పలు ఉపాధ్యాయ సంఘ నేతలు పాల్గొన్నారు.

సురేష్ బాబుకు శుభాకాంక్షలు



సురేష్‌బాబుకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్సీ రమేష్ యాదవ్

కడప కార్పొరేషన్ : వైఎస్సార్‌సీపీ కడప, రాజంపేట పార్లమెంటు నియోజకవర్గాల రీజనల్ కో ఆర్డినేటర్‌గా నియమితులైన కె. సురేష్ బాబుకు ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం స్థానిక అపూర్వ ఫంక్షన్ హాలులో ఆయన సురేష్ బాబుకు శాలువా కప్పి,పూలమాల వేసి ఘనంగా సత్కరించారు.

వైఎస్సార్‌సీపీ గల్ఫ్ కన్వీనర్ బీహెచ్ ఇలియాస్, కువైట్ కన్వీనర్ ఎం. బాలిరెడ్డిలు సురేష్‌బాబును అభినందించారు. బుధవారం ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాలు కప్పి అభినందనలు తెలిపారు.

మూగ జంతువులపై దయ చూపాలి

కడప అగ్రికల్చర్ : ప్రతి ఒక్కరూ నోరులేని మూగ జంతువులపై దయ చూపాలని, ఈ భావాన్ని చిన్న పిల్లలలో పెంపొందించాలని జిల్లా పశుసంవర్ధశాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ శారదమ్మ పేర్కొన్నారు. ఆనిమల్ వెల్ఫేర్ బోర్డు ఆఫ్ ఇండియా వారు ప్రతి ఏటా వసంత పంచమి రోజున జీవ జంతు కళ్యాణ్ దివస్ కార్యక్రమాన్ని జరుపుకుంటున్నారన్నారు. ఇందులో భాగంగా బుధవారం కడపలోని మున్సిపల్ కార్పొరేషన్ నిర్వహిస్తున్న గోశాలలోని పశువులకు గాలికుంటు వ్యాధికి నివారణ టీకాలతోపాటు అనారోగ్య గోవులకు చికిత్స అందించామన్నారు. అలాగే దూడల ఎదుగుదలకు కాల్షియం టానిక్ ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో కడప డివిజినల్ ఉపసంచాలకులు టీవీ రమణయ్య, సహాయ సంచాలకులు డాక్టర్ రాజశేఖర్, బహుళార్థ పశువైద్యశాల ఉపసంచాలకులు డాక్టర్ రంగస్వామి, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్‌లు డాక్టర్ నాగరాజు, డాక్టర్ ఉపేంద్ర, డాక్టర్ సంధ్యారాణి, డాక్టర్ లీలాస్వర్ణలతతోపాటు పశుసంవర్ధశాఖ సహాయకులు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రేపు కడప రాయుడి రథోత్సవం

- పూర్తయిన ఏర్పాట్లు
- తిరునాలకు సర్వం సిద్ధం

కడప కల్చరల్ : దేవుని కడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం రథోత్సవాన్ని నిర్వహించనున్నారు. శుక్రవారం ఉదయం నుంచి భక్తులను తేరుపైకి వెళ్లి స్వామిని దర్శించుకునే అవకాశం కల్పించనున్నారు. తెల్లవారుజాము నుంచే సమీప గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున స్వామి దర్శనం కోసం బారులు తీరి వేచి ఉంటారు. మధ్యాహ్నం రథోత్సవానికి సైతం కడప నగరం నుంచే కాకుండా చుట్టుపక్కల గల గ్రామాలకు చెందిన ప్రజలు వస్తారు. మధ్యాహ్నం 2.30 గంటల తర్వాత రథాన్ని మాడ వీధుల్లో తిప్పేందుకు దేవునికడప, పాతకడప పెద్దలు, యువకులు ఉత్సాహంగా పోటీలు పడతారు. కదం తొక్కుతూ రథాన్ని నడిపించడం ఆనవాయితీగా వస్తోంది.

మన జిల్లాలో దేవుని కడప బ్రహ్మోత్సవాల్లో జరిగే రథోత్సవానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఈ ఉత్సవంలో ఉపయోగించే రథం భారీగా ఉంటుంది. కడప రాయుడిని కుల దైవంగా భావించే పాత కడప, దేవుని కడప గ్రామ పెద్దల పూజల తర్వాతే సర్కార్ హారతిగా టీటీడీ స్థానిక అధికారులు మంగళ హారతులు ఇచ్చి రథాన్ని కదిలించి యాత్రను ప్రారంభిస్తారు.

ఓ చరిత్ర ఉంది..

స్థానిక భక్తులు, అర్చకుల సమాచారం ప్రకారం కడప రాయుని రథాన్ని వందేళ్ల క్రితం నిర్మించారు. రథానికి వాడిన ఇనుప ఇరుసులు, రథం లాగేందుకు ఉపయోగించే ఇనుప గొలుసులను ప్రత్యేకంగా లండన్ నుంచి ఓడలో తెప్పించారని ఆ గ్రామ పెద్దలు చెప్పేవారు. రథంపై శిల్పాలను తమిళనాడులో కళాత్మకంగా రూపొందించారని, నాటి ధార్మిక, సమాజ సేవకులు, వైశ్య ప్రముఖులు ముత్యాల శేషయ్య ఈ రథాన్ని తయారు చేయించడంలో ప్రధానపాత్ర పోషించినట్లు తెలుస్తోంది. ఈ రథానికి మరో విశిష్టత కూడా ఉంది. దీనికి సాధారణంగా నాలుగు చక్రాలతోపాటు వాటి మధ్యలో మరో రెండు చిన్న చక్రాలున్నాయి. ప్రధాన చక్రాల్లో ఏదైనా అనుకోకుండా దెబ్బ తిన్నప్పుడు ఎలాంటి ఆటంకాలు లేకుండా రథాన్ని నడిపేందుకు ఈ ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది.



దేవునికడప రథం

నల్ల బ్యాడ్జీలతో నిరసన



సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవికి వినతి పత్రం సమర్పిస్తున్న ఏపీ ఎన్జీఓ సంఘం నేతలు

కడప అర్బన్ : ఆంధ్రప్రదేశ్ జాయింట్ యాక్షన్ కమిటీ (ఏపీ జేఏసీ) ఆధ్వర్యంలో బుధవారం కడప శివార్లలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో ఓపీ విభాగం ముందు ఏపీ ఎన్జీఓ సంఘం నేతలు, ప్రభుత్వ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలను ధరించి నిరసన తెలియజేశారు. తమ డిమాండ్ల సాధనకోసం ఈ నిరసన తెలియజేస్తున్నామని వారు తెలిపారు. అనంతరం జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవికి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎన్జీఓల సంఘం నాయకులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన

కడప సెవెన్‌రోడ్స్ : రాష్ట్ర జేఏసీ పిలుపుమేరకు బుధవారం జిల్లా పెన్షనర్ల సంఘ కార్యాలయంలో సంఘం అధ్యక్షులు రాధాకృష్ణ ఆధ్వర్యంలో పెన్షనర్లు నల్ల బ్యాడ్జీలతో తమ నిరసన వ్యక్తం చేశారు. పెన్షనర్ల సంఘం నాయకులు మాట్లాడుతూ తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, ప్రతి నెల 1వ తేదినే పెన్షన్ అందేలా చూడాలని కోరారు. ఈ కారక్యక్రమంలో సంఘం కోశాధికారి నూనె నాగేష్, గౌరవ సభ్యులు శంకరయ్య, నారాయణ, వర్మ, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

న్యాయ విజ్ఞాన సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న శాంత

కడప ఎడ్యుకేషన్ : విద్యార్థులకు ఏవైనా సమస్యలుంటే కడపలోని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ వారిని కలవ వచ్చని డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శాంత తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ కం సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫక్రుద్దీన్ సూచనల మేరకు బుధవారం కడప గాంధీనగర్ మున్సిపల్ హైస్కూల్లో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె విద్యార్థులు క్యాస్టు సర్టిఫికెట్, ఇన్‌కం సర్టిఫికెట్ ఎలా తీసుకోవాలనే అంశాలపై వివరించారు. లోకాయుక్త, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టంతోపాటు గుడ్ టచ్, బాడ్ టచ్, టోల్ ఫ్రీ నెంబర్లైన 100, 1098,15100 పైన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మనోహర్, రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, విలేజ్ రెవిన్యూ ఆఫీసర్ రామాంజనేయ, సుబ్బరామయ్య, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ఆశ్రీపున్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీ రాజేశ్వరిమాతకు సహస్ర దీపాలంకార సేవ



దీపాలంకార కార్యక్రమంలో భక్తులు

కడప కల్చరల్ : కడప నగరం మున్సిపల్ మైదానంలోని శ్రీ రాజరాజేశ్వరీదేవి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం అమ్మవారికి సహస్ర దీపాలంకార సేవ నిర్వహించారు. మాఘ (వసంత) శుద్ధ పంచమిని పురస్కరించుకుని అర్చకులు పిడతల మురళీకృష్ణశర్మ, గోపాలకృష్ణశర్మలు ఉదయం 4.00 గంటలకు పంచామృతాభిషేకం, అనంతరం విశేష అలంకారం చేశారు. సాయంత్రం ఉభయదాతల ఆధ్వర్యంలో అమ్మవారికి సహస్ర దీపాలంకార సేవ నిర్వహించారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన మహిళా భక్తులతో సామూహికంగా సుమంగళి పూజ నిర్వహింపజేశారు. దశ హారతులు ఇచ్చారు. అనంతరం నిర్వాహకులు, భక్తులు కార్యక్రమానికి హాజరైన ముత్తయిదువులందరికీ పసుపు, కుంకుమ, గాజులు, అమ్మవారి ప్రసాదంగా అందజేశారు. పూజా కార్యక్రమాలను ఈఓ ఓ.శ్రీధర్ పర్యవేక్షించారు. అనంతరం ఈశ్వర్ అండ్ పార్టీ ఆధ్వర్యంలో భక్తి సంగీత విభావరి నిర్వహించారు.

ఆర్‌జేడీకి శుభాకాంక్షలు

కడప ఎడ్యుకేషన్ : పాఠశాల విద్యాశాఖ ఆర్‌జేడీగా బాధ్యతలు చేపట్టిన ఎద్దుల రాఘవరెడ్డిని బుధవారం ఎస్టీయూ నాయకులతోపాటు హౌస్ బిల్డింగ్ సొసైటీ అధ్యక్షులు కలిసి పుష్పగుచ్ఛాన్ని అందచేసి శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ సీనియర్ నాయకులు టీవీ రమణయ్య, సురేష్‌బాబు, జిల్లా అధ్యక్షుడు ఇలియాష్‌బాషు, టీచర్స్ హౌస్ బిల్డింగ్ సొసైటీ అధ్యక్ష కార్యదర్శులు విశ్వనాథరెడ్డి, బాలశౌరిరెడ్డిలు పాల్గొన్నారు.

దామోదరం సంజీవయ్య సేవలు మరువలేనివి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : దామోదరం సంజీవయ్య ఆంధ్రప్రదేశ్ సీఎంగా చేసిన సేవలు మరువలేనివని పీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి జకరయ్య పేర్కొన్నారు. బుధవారం నగరంలోని ఇందిరాభవన్‌లో దివంగత దామోదరం సంజీవయ్య జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చెప్పలి పుల్లయ్య, ఆనంద్‌కుమార్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అరెస్ట్

కడప అర్బన్ : కడప ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రైల్వే స్టేషన్ సమీపంలో బుధవారం అక్రమంగా మద్యం విక్రయిస్తున్న చిలకల మౌలాలి అనే వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి 30 క్వార్టర్ బాటిళ్ల మద్యంను సీజ్ చేసినట్లు ఎస్ఐ రంగస్వామి తెలియజేశారు.

లైటింగ్ వ్యవస్థను మెరుగుపరచాలి



వీధి దీపాల నియంత్రణ వ్యవస్థను పరిశీలిస్తున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్ : కడప నగరంలో లైటింగ్ వ్యవస్థను మెరుగు పరచాలని నగరపాలక కమిషనర్ జీఎస్‌ఎస్ ప్రవీణ్‌చంద్ అన్నారు. బుధవారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా స్థానిక 19వ డివిజన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన సెంట్రల్ కంట్రోల్ అండ్ మానిటరింగ్ సిస్టమ్ పనితీరును ఆయన పరిశీలించారు. వీధి దీపాల వ్యవస్థను మెరుగు పరచడం ద్వారా విద్యుత్‌ను పొదుపు చేయాలని, రోడ్డు ప్రమాదాలను నివారించాలన్నారు. సీసీ ఎమ్మెస్ ప్రక్రియ ద్వారా వీధి దీపాలను వెలిగించాలన్నారు. సీసీఎంఎస్ బాక్స్‌ల నిర్వహించే వారి ఫోన్ నంబర్ల జాబితా తయారు చేయాలన్నారు. నగరంలో వీధి దీపాలు, కేబుల్స్ సమస్యలను ఫోన్ ద్వారా స్వీకరించి, వెంటనే మరమ్మతులు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ మణిగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు సేవాభావం కలిగి ఉండాలి

కడప ఎడ్యుకేషన్ : నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు చదువుతోపాటు సమాజసేవ కలిగి ఉండాలని స్టెప్ అధికారి సుబ్బరాయుడు అన్నారు. సమాజ సేవలో భాగంగా కేఎస్ఆర్ఎం కళాశాల విద్యార్థులు ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక క్యాంపును నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా నాల్గవ రోజు కొప్పర్తి గ్రామంలో విద్యార్థులు ఆరోగ్య స్థితిగతులు, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ ఇంటింటి సర్వేను నిర్వహించి ప్రజలను చైతన్య పరిచారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎండీ చంద్ర ఓబుల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ వీఎస్ఎస్ మూర్తి పాల్గొన్నారు.

అమరవీరులకు ఘన నివాళి...

పుల్వామా ప్రాంతంలో దేశం కోసం పోరాడి అసువులు బాసిన అమర జవాన్‌లకు కేఎస్ఆర్ఎం విద్యార్థులు కొవ్వొత్తులతో నివాళి అర్పించారు.

అక్షరాభ్యాసం



విజయదుర్గాదేవి ఆలయంలో అక్షరాభ్యాసం



గురుకుల్ విద్యాపీఠ్‌లో అక్షరాభ్యాసం

కడప కల్చరల్ : కడప నగరం శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో బుధవారం చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. శ్రీ సరస్వతీదేవి జన్మనక్షత్రమైన మాఘ పంచమిని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మహిళా భక్తులు తమ చిన్నారులతో ఆలయానికి వచ్చి పూజలు చేయించారు. అనంతరం అభ్యాసాన్ని శాస్త్రోక్తంగా మొదలు పెట్టారు.

బాసటలో...

కడప నగరానికి చెందిన బాసట చిల్డ్రన్ హోంలో నిర్వాహకులు మేరువ బాలాజీరావు, సభ్యులు కె.చంద్రమౌళిరెడ్డి, టి.సుధన్వలు హోంలోని చిన్నారులకు పలకలపై అక్షరాలు దిద్దించారు.

కడప ఎడ్యుకేషన్: వసంత పంచమిని పురస్కరించుకుని బుధవారం కడప ఎన్‌జీవోకాలనీలోని గురుకుల విద్యాపీఠ్‌లో అక్షరాభ్యాస కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఏవీఆర్ విద్యాసంస్థల అధినేత వెంకటేశ్వర్లు, పాఠశాల డైరెక్టర్ వీరకుమారి, సీఈఓ వివేకానంద, ప్రిన్సిపాల్ పల్లవి పాల్గొన్నారు.

మాసాపేట వాసుల చిరకాల వాంఛ సాకారం

- 500 మందికి ఇళ్లపట్టాలు పంపిణీ
- ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు



డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ కె. సురేష్ బాబును గజమాలతో సత్కరిస్తున్న నాయకులు

కడప కార్పొరేషన్ : కడప నగరంలోని మాసాపేట వాసుల చిరకాల కోరిక జగనన్న ప్రభుత్వంలో సాకారమయ్యిందని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా, వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్, కడప మేయర్ కె. సురేష్ బాబు పేర్కొన్నారు. బుధవారం రాత్రి 36వ డివిజన్ కార్పొరేటర్ సి. నాగమణి, డివిజన్ ఇన్‌చార్జి త్యాగరాజు ఆధ్వర్యంలో మాసాపేట వాసులకు పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా మాసాపేట వాసులు తమకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని కోరుతున్నారన్నారు. దివంగత బక్కా అయ్యన్న ఇక్కడి ప్రజలకు పట్టాలు ఇప్పించడానికి తుదిశ్వాస వరకూ కృషి చేశారని గుర్తు చేశారు. వైఎస్ఆర్ రెండోసారి అధికారంలోకి రాగానే ఈ సమస్య పరిష్కారంపై దృష్టి సారించారని, ఆయన మరణించడంతో మళ్లీ అది మూలన పడిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ సమస్యపై ప్రత్యేకంగా దృష్టి సారించి, ఇళ్ల పట్టాలు ఇప్పించేందుకు అధికారులకు ఆదేశాలిచ్చారని గుర్తు చేశారు. అనంతరం డివిజన్ ఇన్‌చార్జి త్యాగరాజు మాట్లాడుతూ కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, రీజనల్ కో ఆర్డినేటర్ కె. సురేష్‌బాబు, డిప్యూటీ సీఎం అంజద్‌బాషా కృషి వల్లే మాసాపేట వాసులు సుమారు 500 మందికి ఇళ్ల పట్టాలు మంజూరయ్యాయని తెలిపారు. అంతకుముందు మాసాపేటలోకి ప్రవేశించిన డిప్యూటీ సీఎం, మేయర్‌లకు స్థానికులు మేళతాళాలతో, బాణసంచా పేల్చి ఘనస్వాగతం పలికారు. క్రేన్ సాయంతో భారీ గజమాల వేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, జిల్లా ఉపాధ్యక్షులు గుమ్మా రాజేంద్రప్రసాద్‌రెడ్డి, ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు ఛైర్మన్ పులి సునీల్ కుమార్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణాన్ని చెడగొట్టేందుకు టీడీపీ పన్నాగం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు ఛైర్మన్ పులి సునీల్ కుమార్

కడప కార్పొరేషన్ : కడప నగరంలో ప్రశాంత వాతావరణాన్ని చెడగొట్టేందుకు తెలుగుదేశం పార్టీ పన్నాగం పన్నిందని ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు ఛైర్మన్ పులి సునీల్ కుమార్, డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఇటీవల కాలంలో కడపలో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోవడం దురదృష్టకరమన్నారు. కొందరు బయటి వ్యక్తులు కడపలో ప్రవేశించి ఈ ఘటనలకు పాల్పడుతున్నారని అనుమానం వ్యక్తం చేశారు. అందులో భాగంగా 39వ డివిజన్ కార్పొరేటర్ కుమారుడిపై టీడీపీకి చెందిన వారు కత్తితో దాడి చేశారన్నారు. ఇరు వర్గాలు పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని విమర్శలు, ప్రతి విమర్శలు చేసుకున్నారని, టీడీపీ శ్రేణులు పెద్ద ఎత్తున పోలీస్‌స్టేషన్‌కు చేరుకోవడం వల్లే అక్కడ ఘర్షణ వాతావరణం ఏర్పడిందన్నారు. ఈ క్రమంలో డిప్యూటీ సీఎం సోదరుడు అహ్మద్‌బాషా ఆవేశానికి లోనై మాట్లాడారన్నారు. వ్యక్తిగత దూషణలు చేయకూడదని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పార్టీ శ్రేణులకు చెప్పారని గుర్తు చేశారు. టీడీపీ వారు కూడా వ్యక్తిగత దూషణలకు దూరంగా ఉండాలని తాము కోరుకుంటున్నామని, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా సమన్వయంతో ప్రచారాలు చేసుకోవాలన్నారు. కడపలో తెలుగుదేశం పార్టీ హత్యా రాజకీయాలను ప్రోత్సహిస్తోందని, కత్తితో పొడిచింది గాక రాజకీయంగా డ్రామాలు ఆడుతున్నారన్నారు. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసులరెడ్డి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. సోషల్ మీడియాలో కూడా వారు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కడప నగరం వైఎస్సార్‌సీపీకి కంచుకోట అని టీడీపీ తలకిందులుగా తపస్సు చేసినా ఆ పార్టీ గెలుపు అసాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సానపురెడ్డి శివకోటిరెడ్డి, కె. బాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు బంగారు నాగయ్య యాదవ్, ఎస్. సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : వైఎస్సార్ కాలనీలో వైఎస్సార్‌సీపీ నగర మహిళా అధ్యక్షురాలు టీపీ వెంకట సుబ్బమ్మ ఏర్పాటు చేసిన నూతన వాటర్ ప్లాంట్‌ను డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ కె. సురేష్ బాబు, కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డిలు బుధవారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ వైఎస్సార్ కాలనీ ప్రజలకు శుద్ధ జలాన్ని అందించడానికి వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, పార్టీ నాయకులు జయచంద్రారెడ్డి, ఐస్‌క్రీం రవి, తోటక్రిష్ణ, సాయిదత్త పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో విద్యార్థుల ప్రభంజనం



అధిక మార్కులు సాధించిన విద్యార్థులతో ఆకాష్ బైజూస్ సంస్థ విద్యార్థులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : జేఈఈ, మెయిన్స్-2024లో ఆకాశ్, బైజూస్ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని ఆకాష్ బైజూస్ కడప సీనియర్ అసిస్టెంట్ డైరెక్టర్ విజయ్‌కుమార్, రీజినల్ సేల్ గ్రోత్ హెడ్ ఎం.భరత్‌కుమార్‌లు తెలిపారు. బుధవారం సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కడప నుంచి పది మంది విద్యార్థులు 91 శాతానికి పైగా సాధించారన్నారు. ఎం.సాయి దివ్యతేజారెడ్డి 99.97 శాతం సాధించగా, ఎం.నాగసంజయ్ 99.93 శాతం, సాయి గణేష్, జస్వంత్ 98.97 శాతం, నవాంత్‌రెడ్డి 98.91 శాతం, గౌతమ్ 97.52 శాతం సాధించారన్నారు.

ఈ కార్యక్రమంలో బ్రాంచ్ హెడ్ మీరావలి, బ్రాంచ్ ఇంజనీరింగ్ అకడమిక్ హెడ్ మహమ్మద్ అఫ్సర్ బాష, సాయిరాం విద్యా సంస్థల చైర్మన్ రాజగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నారాయణ విద్యార్థుల ప్రతిభ

కడప ఎడ్యుకేషన్ : జేఈఈ మెయిన్స్ - 2024 లో కడప నారాయణ జూనియర్ కళాశాల విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. ఇందులో బృంద 99.77 శాతం, హితేష్‌రెడ్డి 99.26 , జాగృతి 99.16, మేఘన రెడ్డి 98.96, వినయ్‌రెడ్డి 98.66, హాసిని 98.62, సాయి వైష్ణవి 97.99 శాతం సాధించారు. సంబంధిత విద్యార్థులను నారాయణ జూనియర్ కళాశాల డీజీఎం రామమోహన్‌రెడ్డి, డీన్ చంద్ర కిషోర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ మురళీమోహన్, వెంకటస్వామి, సుధాకర్‌రెడ్డి, సౌజన్య, రాఘవరెడ్డి, ఏజీఎంలు చెన్నకృష్ణారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, వెంకటరామిరెడ్డిలు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

గాయత్రి కళాశాలలో...

కడప గాయత్రి జూనియర్ కళాశాలకు చెందిన జెతిన్, మోహన్‌కృష్ణ, లోకేష్‌రెడ్డి, భరత్‌కుమార్‌రాజు, బండారు స్వాతి, తనూజ్‌కుమార్, నరసింహా, రాఘవ, జ్యోతిలు 90 శాతం సాధించినట్లు గాయత్రి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జగదీస్ తెలిపారు.

బోధనలో సాంకేతికతను ఉపయోగించండి



మాట్లాడుతున్న డిప్యూటీ ఈఓ రాజగోపాల్ రెడ్డి

కడప ఎడ్యుకేషన్ : బోధనలో డిజిటల్ విద్యను ఉపయోగించడం ద్వారా సాధారణ విద్యార్థులతోపాటు దివ్యాంగులకు ఎనలేని ప్రయోజనం చేకూరుతుందని డిప్యూటీ ఈఓ రాజగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం కడప కలెక్టరేట్ సభాభవన్‌లో సహిత విద్య జిల్లా సమన్వయ కర్త మిట్టా కేశవరెడ్డి ఆధ్వర్యంలో విజన్-2025 ఇంక్లూజివ్ ఆంధ్ర డిజిటల్ పెడగాగి మీద ప్రత్యేక విద్య ఉపాధ్యాయులకు ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి పరచుకుని విద్యార్థులకు అందించాలన్నారు. జిల్లాలోని అన్ని సహిత విద్యా ఉపాధ్యాయులకు ట్యాబ్‌లను ఇచ్చామన్నారు. వాటిని ఉపయోగించుకుని విద్యార్థులకు మెరుగైన శిక్షణ అందించాలని సూచించారు. రాష్ట్ర సహాయ సహిత విద్య సమన్వయకర్త మల్లికార్జున, రిసోర్స్‌పర్సన్‌లు సునిల్‌కుమార్, మహాలక్ష్మినాయుడులు దివ్యాంగులకు ఉద్దేశించిన వివిధ యాప్‌లను గురించి ఉపాధ్యాయులకు పరిచయం చేశారు. దృష్టిలోపం, పాక్షిక దృష్టిలోపం, వినికిడిలోపం, మేధో వైకల్యం, ఆటిజం, మస్తిష్క పక్షపాతం, అభ్యసన వైకల్యం గల విద్యార్థులకు ఈ యాప్‌లు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో సహిత విద్య సమన్వయకర్త మిట్టా కేశవరెడ్డి, అకడమిక్ మానటరింగ్ అధికారి ధనలక్ష్మి, సహాయ సహిత విద్యా సమన్వయకర్త రమణమూర్తి, ప్రత్యే విద్య ఉపాధ్యాయులు, భవిత రీసోర్సుపర్సన్స్ పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆర్టీసీలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ కడప రీజియన్ ప్రతినిధులు సగినాల శ్రీనివాసులు, దాస్ కోరారు. బుధవారం కడప ఆర్టీసీ గ్యారేజీ వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టీసీ అధికారులు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు నాగరాజు, మల్లేష్, వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.